ప్రజావాణిలో 475 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 475 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 120, మైనారిటీ వెల్ఫేర్ 60, సాంఘిక సంక్షేమ శాఖ 53, పంచాయత్ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ 38, పౌరసరఫరాల శాఖ 36, ఇతర శాఖలకు సంబంధించి 168 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య బాధితుల సమస్యలను అడిగి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఉపాధి అవకాశాల కోసమే సిఎం తపన

- టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తపన పడుతున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ చెప్పారు. ఆయా దేశాలకు చెందిన వివిధ కంపెనీల నుంచి పెట్టుబడులు రావడంతో యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విదేశీ పెట్టుబడుల రాకతో రాష్ట్రానికి చెందిన 10 లక్షల మంది యువతకు ప్రయివేటు రంగంలో పుష్కలంగా ఉద్యోగాలు దక్కుతాయన్నారు. స్కిల్ యూనివర్సిటీతో తెలంగాణ యువతకు డిగ్రీ పూర్తి అయినా వెంటనే ఉద్యోగం వస్తుందని చెప్పారు. మాజీ మంత్రి కెటిఆర్ సెల్ఫీల కోసం విదేశీ పర్యటన చేశారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ హయాంలో యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇప్పించారో చెప్పగలరా? అని కెసిఆర్‌ను ప్రశ్నించారు. 2023లో కేటీఆర్ పర్యటన చేసి తెలంగాణలో 42000 ఉద్యోగాలు అని చెప్పినా, నలుగురికి కూడా రాలేదని గుర్తు చేశారు.

బిఎస్‌హెచ్ నూతన శ్రేణి డిష్‌వాషర్

హైదరాబాద్ : సాంకేతికంగా అధునాతన బోష్, సిమెన్స్ డిష్‌వాషర్‌ల నూతన శ్రేణీని విడుదల చేసినట్లు బిఎస్‌హెచ్ హోమ్ అప్లయిన్సెస్ తెలిపింది. ఇవి 15 ప్లేస్ సెట్టింగ్‌ల సామర్థ్యంతో పెద్ద కుటుంబాలకు సరిపోతాయని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023-24లో డిష్‌వాషర్ విభాగంలో తమ కంపెనీ రెండంకెల వృద్ధిని సాధించిందని వెల్లడించింది. భారత డిష్‌వాషింగ్ విభాగంలో 53 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నట్లు తెలిపింది.

ఎన్‌పిఎ ఖాతాదారులకు సువర్ణావకాశం

- బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బిఒఐ) ఎన్‌పిఎ ఖాతాదారులకు సదావకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. ఆగస్ట్ 16, 17న మొండి బాకీల పరిష్కారానికి వన్ టైం సెటిల్‌మెంట్ (ఒటిఎస్) సువర్ణావకాశాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది. దేశ స్వాతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా దీన్ని అర్హులైన తమ ఖాతాదారులు ఉపయోగించుకోవాలని బిఒఐ తెలంగాణ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (రికవరీ) ఓ ప్రకటనలో తెలిపారు. ఒకేసారి ఎన్‌పిఎ ఖాతాను మూసివేయడం ద్వారా రుణ విముక్తి పొందవచ్చన్నారు. ఇందుకోసం ఖాతాదారులు తమ రుణ ఖాతా కలిగిన బిఒఐ శాఖను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ హాస్టళ్లలో ఎసిబి తనిఖీలు

- ఆహారం నాణ్యత.. సౌకర్యాల పరిశీలన
- ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు
- రికార్డులు సక్రమంగా లేనట్టు గుర్తింపు
- మరుగుదొడ్లకు డోర్లు లేవు..
- ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో ఆహారం కలుషితం.. నాసిరకం భోజనం, సౌకర్యాలు, విద్యార్థుల అనారోగ్యం ఘటనల నేపథ్యంలో ఎసిబి రంగంలోకి దిగింది. మంగళవారం ఏకకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా హాస్టళ్లలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. విద్యార్థుల సంఖ్య, రికార్డులు, ఆహారం నాణ్యత, సౌకర్యాలను పరిశీలించారు. వంటశాలలు, పరిసరాల్లో కలియ తిరిగి పరిశీలించారు. దీనిపై సమగ్ర నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేయనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సోదాలు జరిగాయి. తనిఖీల్లో శానిటేషన్, ఫుడ్‌సేఫ్టీ, తూనికలు, కొలతలు, ఆరోగ్యం, ఆడిట్ శాఖల అధికారులు సైతం ఉన్నారు.

ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో కారేపల్లి మండలం గాంధీనగర్‌లోని గిరిజన గురుకుల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉదయం 6 గంటలకే.. మరుగుదొడ్లు, డార్మెటరీ, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్, క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించగా.. ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరయ్యారు. మెనూ అమలుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో మాట్లాడారు. స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉండటం, వాటికి తలుపు కూడా లేకపోవటంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ.. డార్మెటరీ, కిచెన్, వాష్ రూమ్ సరిగా లేవన్నారు. స్టాఫ్ హాజర్ సక్రమంగా లేదన్నారు. తమ దృష్టికి వచ్చిన లోపాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మంచిర్యాల జిల్లా వేమనపల్లి ఎస్‌టి బాలుర వసతి గృహంలో స్టాక్ రిజిస్టర్, కిచెన్ గదులు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. పలు సమస్యలను గుర్తించారు. విద్యార్థుల హాజరులో వ్యత్యాసం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

సిద్దిపేట పట్టణంలోని బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో 12 రికార్డుల నిర్వహణ లేదని, విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్ నిర్వహణ కూడా సరిగా లేదని గుర్తించినట్టు ఎసిబి డిఎస్‌పి సుదర్శన్ తెలిపారు. మెదక్ రోడ్డులో ఉన్న బిసి ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను ఎసిబి డిఎస్‌పి బృందం ఫుడ్ సేఫ్టీ, తూనికల కొలతలు, ఆడిట్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. హాస్టల్లో రికార్డులను, రిజిస్టర్‌లను, విద్యార్థులకు వండించే భోజన సరుకులను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. మూత్రశాలలకు డోర్లు లేవని, విద్యుత్ సౌకర్యం లేదని, 90 మంది ఉన్నట్టు ఆన్‌లైన్‌లో ఉండగా.. రిజిస్టర్‌లో 71 మంది పేర్లే ఉన్నాయని తమ పరిశీలనలో తేలిందని డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబి సీఐలు రమేష్, వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అధికారి శ్రీషిక, తూనికల కొలతలు అధికారి అనిల్‌కుమార్, ఆడిట్ అధికారి సచిన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సిరిసిల్లలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలోనూ తనిఖీలు చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనూ సోదాలు జరిగాయి.

'సీతారామ' కోసం ఎంతో చేశా..

- 15న మీరూ రండి.. నెత్తిన నీళ్లు చల్లిస్తా..
- మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గోదావరి జలాల కోసం పట్టుబట్టి దుమ్ముగూడెం ప్రాజెక్టును ప్రతిపాదించా.. నా ప్రతిపాదన మేరకే నాటి ప్రభుత్వాలు అనుకూలంగా స్పందించాయి. నాడు ఇదే ప్రాజెక్టు కోసం పాదయాత్ర చేశాను. సరిగ్గా అదే సమయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోవడంతో ఈ ప్రాజెక్టులు కుంటుబడ్డాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు నీళ్లివ్వడమే నా లక్ష్యం.. కీర్తి ప్రతిష్ఠల కోసం ఆరాట పడే వ్యక్తిని కాదు.. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉంటా.. నేను చేసే పనులే నా ఫ్లెక్సీ" అని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల ఖమ్మంలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో భావోద్వేగంగా స్పందించారు. రైతుల కోసమే తాను పనిచేస్తా తప్ప.. స్వార్ధ రాజకీయాల కోసం కాదన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరా-రాజీవ్‌సాగర్‌గా విభజించి పనులు చేపట్టారన్నారు. 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ప్రాజెక్టుల కోసమే వెంపర్లాడానని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ కోసం ప్రయత్నిస్తున్నానని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు.

తాను క్రెడిట్ కోసం తాపత్రయ పడే వ్యక్తిని కాదన్నారు. 2023 ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ పిలుపు మేరకే తాను కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. ఆయనకు కూడా సీతారామ ప్రాజెక్టు తన 'కల'గా చెప్పానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టి తాను జిల్లాకు రాగానే నీటిపారుదల శాఖ అధికారులను పిలిచి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించానన్నారు. ఆర్నెళ్లలో పనులు పరుగులు పెట్టాయన్నారు. మూడు మోటార్ల ద్వారా గోదావరి జలాలు జిల్లాకు వస్తున్నాయని తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో పనులు చేయకుండా నేడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వారి విజ్ఞతకే వదిలివేస్తున్నానని అన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులు ఎలా జరుగుతున్నాయో మంత్రులను తీసుకెళ్లి చూపిస్తే విపక్ష నేతల కడుపు మండుతోందని విమర్శించారు. ఈనెల 15న మీరూ రండి.. మీనెత్తి మీద నీళ్లు చల్లిస్తానని అన్నారు. వైఎస్ఆర్, చంద్రబాబు పూర్తి చేసిన రోడ్లను మీరు ప్రారంభించలేదా? అని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ ప్రతి లిఫ్ట్ వెనుక తన కృషి ఉందన్నారు.

రుణమాఫీ తర్వాత పంచాయతీలకు నిధులు

- స్పెషల్ అధికారుల్లారా..ప్రజలకు అందుబాటులో ఉండండి
- ఆగస్ట్ 15న అధికారులను, పారిశుధ్య కార్మికులను సన్మానించండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తికాగానే గ్రామ పంచాయతీలకు కావాల్సినన్ని నిధులు అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) భరోసానిచ్చారు. ప్రతిరోజూ పంచాయతీల్లో స్పెషల్ అధికారులు మూడు గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు మరింత దృష్టి సారించాలనీ, నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం విజయవంతం కోసం జిల్లా స్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరూ బాగా కష్టపడ్డారని అభినందించారు. వారందర్నీ ఆగస్టు 15న సన్మానించాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అనుకున్నంత ఫలితాలు సాధించినప్పటికీ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు మెరుగైన శానిటేషన్ కోసం నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. ప్రతినెలలో మూడు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం సాగుతుందని స్పష్టం చేశారు. పారిశుధ్య లోపంపై పత్రికల్లో వార్తలు రావడం బాధాకరమనీ, ఆ ప్రాంతాల్లో ఏమేం సమస్యలున్నాయో తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అదే సమయంలో పనిగట్టుకుని తప్పుడు వార్తలు వస్తే ప్రజలకు నిజమేంటో వివరించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ఊర్లకు ఊర్లే చికెన్‌గున్యాతో మంచానపడ్డాయనీ, ఇప్పుడా పరిస్థితి రాష్ట్రంలో లేదని గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సిబ్బంది హాజరు, చేసిన పనుల వివరాలను ప్రతిరోజూ పై అధికారులకు నివేదించాలని స్పెషల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు దోమల నివారణపైనా, పారిశుధ్యంపైనా అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. ప్రతిరోజూ నీటి నిల్వలను శుభ్రపరిచేలా డ్రై డేను ఖచ్చితంగా పాటించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా విద్యార్థులకు మరో జత యూనిఫాం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి ప్రోగ్రాంలో ఎస్‌సి, ఎస్‌టి మహిళల భాగస్వామ్యం పెరిగేలా చూడాలన్నారు. ఆవాస గ్రామాల్లో పర్యటించి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. పిఆర్, ఆర్‌డి కార్యదర్శి లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ..స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగించాలని సూచించారు. డ్రై డేను ఆపొద్దని స్పష్టం చేశారు. దాన్ని ఆపితే పారిశుధ్యం పడకేసే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ..మహిళా సంఘాల బలోపేతంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఆ శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ మాట్లాడుతూ..తడి, పొడి చెత్తలను వేరుచేసేలా సగ్రిగేషన్ షెడ్స్ ఉపయోగాన్ని పెంచాలన్నారు. దోమల నివారణ కోసం నిరంతరం ఫాగింగ్ చేయాలన్నారు.

రేపే రూ.2 లక్షల రుణమాఫీ

- వైరాలో ప్రారంభించనున్న సిఎం రేవంత్‌రెడ్డి
- భారీగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15న గురువారం) సందర్భంగా మూడో విడత పంట రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని రాగానే ఖమ్మం జిల్లా వైరాలో రుణమాఫీ నిధులను విడుదల చేయనున్నారు. మూడో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.రెండు లక్షల వరకు ఉన్న పంట రుణాలు మాఫీ చేయనున్నారు. ఆ రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఆ నిధులను జమ చేస్తారు. దీంతో రుణమాఫీ ప్రక్రియ ముగియనుంది. రూ.రెండు లక్షలకు మించి పంట రుణాలున్న రైతులకు చివరి విడతగా నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణమాఫీ విధి విధానాల్లో ఈ విషయాన్ని ముందుగానే వెల్లడించింది.ఆగస్టు 15లోగా రైతులకు ఏకకాలంలో రూ.రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి అంతకు నెల రోజుల ముందే ఈ పథకాన్ని అమలు చేసిన సంగతి తెలిసిందే. 32.50 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసేందుకు రూ.31 వేల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే కొత్త రికార్డు నెలకొల్పిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జులై 15న రుణమాఫీ జీవో జారీ చేసిన ప్రభుత్వం... మూడు రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం మొదలు పెట్టింది. జులై 18న మొదటి విడతగా లక్ష రూపాయల స్లాబ్ వరకు రుణమున్న రైతు కుటుంబాలన్నింటికీ ఏకకాలంలో రుణమాఫీ చేసింది. 11,14,412 మంది రైతులకు రూ.6034.97 కోట్లు విడుదల చేసింది. జులై 30న అసెంబ్లీ వేదికగా రెండో విడత రుణమాఫీ కార్యక్రమం అమలు చేసింది. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు రుణమున్న రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. దాదాపు 6,40,823 మంది రైతుల ఖాతాల్లో రూ.6190.01 కోట్లు జమ చేసింది. కేవలం 12 రోజుల్లోనే దాదాపు 17.55 లక్షల రైతుల కుటుంబాలకు రూ.12 వేల కోట్లకుపైగా రుణమాఫీ నిధులు జమ చేయటం తెలంగాణ చరిత్రలో ఇదే మొదటిసారి అని ప్రభుత్వం పేర్కొంది.

కేసులు నాకు కొత్త కాదు

- అధికారులు వస్తుంటారు పోతుంటారు.. నేను లోకల్
- హైడ్రా కమిషనర్‌పై ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియాతో మాట్లాడుతున్న దానం నాగేందర్

హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగనాథ్‌కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్టుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారన్నారు. అధికారులు వస్తుంటారు పోతుంటారు, కానీ తాను మాత్రం లోకల్ అని అన్నారు. హైదరాబాద్ నందగిరిహిల్స్ హుడా లేఔట్ ఘటన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. నందగిరిహిల్స్ హుడా లేఔట్ విషయంలో అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారన్నారు. పేదల గుడిసెలను కూల్చివేసే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బస్తీవాసులకు దారి లేకుండా ప్రహరీ గోడ ఎలా కడతారని ప్రశ్నించినందుకే ఇవిడిఎం అధికారులు తనపై కేసు పెట్టారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తనపై 190 కేసులున్నాయని, వాటికి భయపడేది లేదని అన్నారు. ఈ వ్యవహారంలో అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తానని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. దాంతోపాటు సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

అసలేం జరిగిందంటే..

ఈ నెల 10న ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరిహిల్స్ గురుబ్రహ్మ నగర్‌కు చేరుకుని ఆక్రమణదారులను రెచ్చగొట్టారని, ఎమ్మెల్యే సమక్షంలోనే ఆక్రమణదారులు పార్కు గోడను కూల్చేసినట్టు జిహెచ్‌ఎంసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పాపయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్‌తోపాటు.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు బస్తీవాసులపై కేసు నమోదు చేశారు.

డిఎస్‌సి ప్రాథమిక కీ విడుదల

- 20 వరకు ఆన్‌లైన్‌లో అభ్యంతరాల స్వీకరణ
- పాఠశాల విద్యాశాఖ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డిఎస్‌సి) రాతపరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్ షీట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండితులు, సెకండరీ గ్రేడ్ టీచర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను విడుదల చేశామని వివరించారు. వాటికోసం www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రాథమిక కీపై ఈనెల 20న సాయంత్రం ఐదు గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలను అభ్యర్థుల నుంచి స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను ష్టవశ్రీజూనవంఎ-ంష2024ఏస్త్రఝఅశ్రీ.ఙశీఎ పంపించాలని కోరారు. భౌతికంగా అభ్యంతరాలను స్వీకరించబోమని స్పష్టం చేశారు. గతనెల 18 నుంచి ఈనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సిబిఆర్)లో డిఎస్‌సి రాతపరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. 34,694 (12.39 శాతం) మంది గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌లో భారీ వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం పలుచోట్ల అకస్మాత్తుగా గంటపాటు భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, సనత్‌నగర్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎర్రమంజిల్, కూకట్‌పల్లి, ఖైరతాబాద్, లక్డీకపూల్, మాదాపూర్, బాలానగర్, మెహదీపట్నం, టోలిచౌకి, యూసఫ్‌గూడ, మాసాబ్‌ట్యాంక్, సికింద్రాబాద్, ఉప్పల్, రామంతపూర్, కోఠి, అబిడ్స్ సహా పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉద్యోగులు కార్యాలయాలకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. పంజాగుట్టలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. భారీ వర్షం నేపథ్యంలో జిహెచ్‌ఎంసి అధికారులు అప్రమత్తం అయ్యారు. జిహెచ్‌ఎంసి సిబ్బంది, పోలీసులు డ్రయినేజీ మ్యాన్‌హోల్స్ తెరిచి వరద నీరు పోయేలా చర్యలు తీసుకున్నారు.

ఆర్డినెన్స్‌కు అంత తొందరెందుకు?

- ముందు జనాభా లెక్కలు తేల్చండి
- ఎస్‌సి వర్గీకరణ న్యాయమే
- మాలలకు అన్యాయం చేయొద్దు
- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి వర్గీకరణ కోసం అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అసంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఎస్‌సిల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకుందని చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో మాట్లాడాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చర్చకు అవకాశమిచ్చారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ముందుగా ఎస్‌సిల జనాభా లెక్కలు తేల్చాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణ న్యాయమైనదేననీ, అయితే ఆ పేరుతో మాలలకు అన్యాయం చేయొద్దని కోరారు. తెలుగుదేశం పార్టీ వర్గీకరణ పేరుతో గతంలో మాలల జనాభా కన్నా తక్కువ శాతం రిజర్వేషన్ ఇచ్చి అన్యాయం చేసిందని విమర్శించారు. మాలలను, వారి ఉపకులాల నుంచి వేరుగా చూపించి తక్కువ శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. రాష్ట్రంలో మాదిగలు 40 లక్షల మంది ఉంటే, మాలలు 30 లక్షల మంది ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మాల, మాదిగల జనాభాలో ఐదు శాతమే తేడా ఉందనీ, ఈ విషయంలో దళిత మేధావి విశారదన్ లాంటి వారు బాగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఎస్‌సి వర్గీకరణ సంక్లిష్టమైనదనీ, అయితే న్యాయమైందని అభిప్రాయపడ్డారు. భారత సమాజం వర్ణవ్యవస్థ, కుల వ్యవస్థతో నిండి ఉందని గుర్తు చేశారు. చుండూరు, లక్ష్మీపేట, కారంచేడులో ఏం జరిగిందో ఇప్పటికీ తెలియదనీ, దోషులకు ఎందుకు శిక్ష పడలేదని ప్రశ్నించారు. వీటికి సమాధానం చెప్పకుండా పీడిత కులాల మధ్య సమస్య వచ్చే సరికి సహా అందరూ చప్పట్లు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలు అనేక ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్ధతుగా నిలిచారని గుర్తుచేశారు.

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు సంతోషకరమైన వార్త అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదిని ఏర్పాటు చేసి సహకరించిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ అనేక ప్రతికూల పరిస్థితులు ఎదురైనా త్యాగాలకు వెరవక పోరాడిన వర్గీకరణవాదుల డిమాండ్‌లోని హేతుబద్ధతను సుప్రీంకోర్టు అర్థం చేసుకుందని తెలిపారు. తాను శాసనసభ స్పీకర్‌గా ఉన్న సమయంలో వర్గీకరణ కోసం అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్ రెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు మాదిగలకు ఊరటనిచ్చిందని చెప్పారు. ఎంఐఎం సభ్యులు మీర్జా రియాజుల్ హసన్ ఎఫెండీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.వీ.ఎన్.రెడ్డి సుప్రీం తీర్పును స్వాగతించారు.

ఐక్యంగా ముందుకు రావాలి : అలుగుబెల్లి నర్సిరెడ్డి

అట్టడుగు కులాల మధ్య కొన్ని వ్యత్యాసాలున్నాయనీ, దానితో ఉద్యమాలు జరిగాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆ వర్గాలు ఘర్షణ పడకుండా సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలకు వ్యతిరేకంగా పోరాటంలో ముందుకు రావాలని సూచించారు. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో 'ధరణి' దందా

- 14 గుంటల భూమి క్లియరెన్స్‌కు రూ.8 లక్షలు డిమాండ్
- ఎసిబికి చిక్కిన అదనపు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 'ధరణి' దందా వెలుగులోకి వచ్చింది. అదనపు కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్ రూ. ఎనిమిది లక్షల లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో పలువురు కలెక్టర్లపై కూడా ఆరోపణలు వచ్చాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జక్కిడి ముత్యంరెడ్డి అనే వ్యక్తికి చెందిన 14 గుంటల భూమి నిషేధిత జాబితాల్లో ఉంది. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులను కోరాడు. అందుకు సీనియర్ అసిస్టెంట్ రూ.8లక్షలు డిమాండ్ చేయడంతో బాధితుడు ఎసిబిని ఆశ్రయించారు. అనంతరం బాలాపూర్ మండలం గుర్రంగూడ ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం రాత్రి ముత్యంరెడ్డి నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి రూ.8 లక్షలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకుని విచారించారు. అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి తీసుకొమ్మంటేనే నగదు తీసుకున్నట్టు ఆయన చెప్పారు. దాంతో ఎసిబి అధికారులు మదన్ మోహన్‌రెడ్డితో ఎసికి ఫోన్ చేయించారు. డబ్బులు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు రావాలని ఎసి చెప్పారు. దాంతో అదే రోజు రాత్రి మదన్ మోహన్‌రెడ్డితోపాటు అక్కడకు వెళ్లిన ఎసిబి అధికారులు.. అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డిని పట్టుకున్నారు. అనంతరం వీరిద్దరిని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి తీసుకెళ్లి ఎసి ఛాంబర్‌లో రాత్రంతా సోదాలు చేశారు. మంగళవారం ఉదయం తెల్లవారుజామున నాగోల్ బండ్లగూడలోని హిందూ హరణ్య విల్లాలోని అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి నివాసంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. అనంతరం ఇరువురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

భారీ మొత్తంలో డాక్యుమెంట్లు స్వాధీనం

అదనపు రెవెన్యూ కలెక్టర్ భూపాల్‌రెడ్డి నివాసంలో సోదాల సందర్భంగా ఎసిబి అధికారులకు పెద్దఎత్తున డాక్యుమెంట్ల్ లభ్యమైనట్టు సమాచారం. రూ.16లక్షలతోపాటు ప్లాట్లు, వ్యవసాయ భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న స్థిరాస్థులను, నగదును ఎసిబి కోర్టుకు సమర్పించారు. ఈ పత్రాల ఆధారంగా ఆదాయానికి మించి ఆస్తులను కూడగట్టినట్టు అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో ఎసిబి సిటీ రేంజ్-1 డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు జానకిరామ్ రెడ్డి, నరేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీడిజైన్లతో ఖర్చు నాలుగింతలు పెంచారు

- కమీషన్ల కోసం కెసిఆర్ కక్కుర్తిపడ్డారు
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టులను రీడిజైన్ల పేరుతో పేర్లు మార్చి ఖర్చును నాలుగింతలు పెంచారని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారని గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పేరు వస్తుందనే కారణంతో రీడిజైన్ చేశారన్నారు. రాష్ట్రంలో నీటి పారుదల శాఖను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత బిఆర్ఎస్ సర్కారు రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, నామమాత్రపు ఆయకట్టుకు సాగునీరు ఇచ్చిందని విమర్శించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో సమాచార, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపి రఘురామరెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు మూడు పంపులను సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు తెలిపారు. 2026, ఆగస్టు 15 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. ' కాళేశ్వరం ప్రాజెక్టుకు గత ప్రభుత్వం రూ. లక్షల కోట్లు వ్యయం చేసి లక్ష ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదు.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు, సీతారామా ప్రాజెక్టుకు రూ. 7,436 కోట్లు ఖర్చు చేసిన అప్పటి ప్రభుత్వం ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇవ్వలేదు. ఎస్ఎల్‌బిసి టెన్నెల్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. పదేళ్ల అధికారంలో కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నీటిపారుదల శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నామని' తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు మాత్రం కాంగ్రెస్ సర్కారును విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. వైఎస్సార్ హయాంలో రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులు చేపట్టారని చెప్పారు

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్

కనీసం డ్రైరన్ కూడా చేయలేదు : పొంగులేటి

సీతారామా ప్రాజెక్టుకు రూ.18,231 కోట్లకు గాను రూ. 7230 కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మోటార్లు బిఆర్ఎస్ హాయాంలోనే బిగించారని విమర్శించారు. కమీషన్ ఎక్కువ వస్తుంది కాబట్టే ముందు మోటార్లు పెట్టారన్నారు. కానీ కనీసం డ్రైరన్ కూడా చేపట్టలేదని చెప్పారు. గత మూడు ఎన్నికల్లో ఖమ్మం జిల్లా ప్రజలు బిఆర్ఎస్‌కు ఇచ్చింది ఒక్కటే సీటు.. ఇక భవిష్యత్‌లో బిగ్ జీరో నేనని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఆ ఒక్క సీటు కూడా నా బొమ్మ పెట్టుకుని నా శిష్యుడే గెలిచాడని చెప్పారు. బిఆర్ఎస్ మాదిరిగా గత ప్రభుత్వం చేసిన పనులను తమ ప్రభుత్వం చేసినట్టుగా చెప్పడం లేదన్నారు. ఖమ్మం పౌరుషం ఏంటో నీ మామను అడుగు హరీశ్‌రావు అని వ్యాఖ్యానించారు. ఖమ్మం ప్రజలను ఎంత తక్కువ

సెప్టెంబర్ రెండో వారంలోగా భూ సేకరణ

- సిఎస్ శాంతికుమారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం సెప్టెంబరు రెండో వారంలోగా భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పురోగతిపై కలెక్టర్లతో సిఎస్ మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులకు చట్టపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులపై ప్రత్యేక చొరవ తీసుకుని, త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక సిఎస్ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవిన్ మిత్తల్, అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి, ఆర్అండ్‌బి ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

గురుకుల సమస్యలపై ప్రభుత్వం స్పందన హర్షణీయం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల పాఠశాలల్లోని సమస్యలపై ప్రభుత్వం స్పందించటం హర్షణీయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎనిమిది నెల్లలో విషాహారం కారణంగా దాదాపు 500 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల భోజనానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. తాజాగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ పాఠశాలలను సందర్శించటం అభినందనీయమని తెలిపారు. మంత్రులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల భోజనం సహా ఇతర అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. అంతా బాగానే ఉందన్నట్టు మొద్దు నిద్రలో ఉన్న సర్కార్‌ను మేల్కొనే విధంగా తమ పార్టీ కార్యకర్తలు కృషి చేసినందుకు సంతోషంగా ఉందని చెప్పారు. కెసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెయ్యి గురుకులాల్లో విద్యా, భోజనం, వసతులు బాగుండేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కెటిఆర్ ప్రభుత్వాన్ని కోరారు.

కీర్తిలాల్‌లో 'ది టైమ్ లెస్ ఎడిట్' వజ్రాభరణాలు

హైదరాబాద్ : ప్రముఖ లగ్జరీ జ్యువెలరీ బ్రాండ్ అయిన కీర్తిలాల్స్ తన తాజా వజ్రాభరణాల సేకరణ అయిన "ది టైమ్ లెస్ ఎడిట్" ఉత్పత్తులను ప్రదర్శన, విక్రయానికి ఉంచుతున్నట్లు తెలిపింది. నగరంలోని సోమాజిగూడ షోరూమ్‌లో వీటిని అందుబాటులో ఉంచినట్లు కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తెలిపారు. ఆగస్టు 22 వరకు వీటిని సందర్శించవచ్చన్నారు. ఆధునిక శైలి ప్రామాణికమైన సంప్రదాయిక శ్రేష్టతలను ఎంతో చక్కగా మేళవించి, ప్రత్యేకమైన రూపకల్పనలతో వీటిని అందుబాటులోకి తెచ్చామన్నారు.

KIRTILALS
FINE DIAMOND AND GOLD JEWELLERY

ఎక్స్‌టర్నల్ నిధుల సద్వినియోగం

- ఐసిఎఆర్ చైర్మన్ డాక్టర్ ఎస్‌కె చౌదరి సూచన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వివిధ ప్రాజెక్టుల కింద ఇస్తున్న ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్(నిధులను)ను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఐసిఎఆర్ క్రిడా చైర్మన్ డాక్టర్ ఎస్‌కె చౌదరి సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఐసిఎఆర్, సిఆర్ఐడిఎ క్యాంపస్‌లో 'ఎక్స్‌టర్నల్ ప్రాజెక్టుల'పై ఆయన రెండు రోజులపాటు సమీక్ష సమావేశం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 30 మంది పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై వివరించారు. ఎస్‌కె చౌదరి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్‌పై ప్రతి ఏటా రెండు దఫాలుగా సమీక్షలు నిర్వహించి, మరింత సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. ఎన్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్‌ల కింద ఉన్న సౌకర్యాలను ఆయన ప్రశంసించారు. వ్యవసాయం, కరువు పర్యవేక్షణ, నిర్వహణ, నీటి ఉత్పాదకత, పంటల సాగు, వరద బీమా తదితరాంశాలపై చర్చించినట్టు తెలిపారు. హయత్‌నగర్‌లోని కెవికెలో వ్యవసాయ యంత్రాలు, సీడ్‌హబ్, సోలాబ్ పవర్డ్ మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్, బయోఫెర్టిలైజర్ ఉత్పత్తితో సహా అగ్రోఫారెస్ట్రీ సిస్టమ్‌లను బుధవారం ఆయన సందర్శించనున్నారు.

వేణుస్వామిపై చర్యలు తీసుకోండి

మహిళా కమిషన్‌కు తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియాలో సినీ ప్రముఖులపై వ్యక్తిగత జీవితాలను మీడియాకు చెబుతున్న వేణుస్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ డిమాండ్ చేశాయి. సోమవారం ఎంజీ రోడుల్లో బుద్ధభవన్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మెన్ నేరెళ్ల శారదకు ఆయనపై ఫిర్యాదు చేశారు. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు మాట్లాడుతూ అక్కినేని నాగ చైతన్య, శోభిత ధూళిపాళల నిశ్చితార్థం రోజున వారి జాతకాలను విశ్లేషణ చేస్తూ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడాన్ని వారు తప్పు పట్టారు. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సినిమా రిలీజ్‌లపై, రాజకీయ ఫలితాలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి అబాసు పాలైనా ఆయనకు బుద్ధి రాలేదని విమర్శించారు. అసలు వ్యక్తిగత విషయాలను నలుగురిలో మాట్లాడకూడదనే జ్ఞానం కూడా లేని వేణుస్వామి వాళ్లు ఎప్పుడు విడిపోతారో కూడా చెప్పేశారని విమర్శించారు. విషయంపై స్పందించిన నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిలించి వివరణ అడుగుతామని హామీ ఇచ్చారు. ఆ విషయాలను టెలికాస్ట్ చేసిన యూట్యూబ్ చానల్స్‌పై చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సురేంద్ర కుమార్ నాయుడు, ప్రసాదం రఘు, లక్ష్మి, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షురాలు వనం ప్రేమమాలిని, కార్యదర్శి వేదుల మూర్తి, సభ్యులు సువర్ణ, తేజస్విని, భాగ్య లక్ష్మి, కుమార్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వనజ పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీ పేరుతో కలుషితం చేస్తే ఊరుకోం

- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు
- కొడంగల్‌లో భూ సదస్సు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి పేరుతో పేదల భూములు గుంజు కుంటామంటే.. ఊరుకునేది లేదని, ప్రాణాలను అడ్డుపెట్టైనా వాటిని రక్షించుకుంటామని వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో ఇక్కడ భూమిని కలుషితం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య అధ్యక్షతన మంగళవారం భూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదన్నారు. కానీ, ప్రజలను ముంచి.. కార్పొరేట్ శక్తులకు, కాంట్రాక్టర్లకు మేలు చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇక్కడ ఫార్మా కంపెనీపై ప్రజల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. నాలుగు నెలల ముందు ఫార్మా కంపెనీ రాదని చెప్పిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఎందుకు తీసుకొస్తున్నారని అన్నారు. వేల ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దాన్ని కొడంగల్ అభివృద్ధికి వాడుకోవచ్చని సూచించారు. కేవలం ఎస్‌సి, ఎస్‌టిల భూములు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. భూ బాధితులు అందరూ ఐక్యంగా ఉండి భూములను రక్షించుకునేందుకు పోరాటం చేద్దామన్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ హక్కుల సంఘం నాయకులు కొత్తూరు చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి ఎరన్‌పల్లి శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, వ్యకాస జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మల్కయ్య, అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ బాబు, జెఎసి నాయకులు వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న రైతులు

వరంగల్‌లో ఇంటర్ ఆర్‌జెడి కార్యాలయం పునరుద్ధరణ

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జెడి) కార్యాలయాన్ని వరంగల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓజా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్‌జెడి కార్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేక కార్యాలయం ఏర్పాటయ్యే వరకు అక్కడ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆర్‌జెడి కార్యాలయానికి సంబంధించిన బోధనేతర సిబ్బంది డిఐఇఒ కార్యాలయంలో పనిచేస్తున్న వారు తిరిగి ఆర్‌జెడి కార్యాలయంలో పనిచేయాలని కోరారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. వరంగల్‌లో ఉన్న ఆర్‌జెడి కార్యాలయాన్ని గతంలో హైదరాబాద్‌కు తరలించిన విషయం తెలిసిందే.

ఖనిజ రంగ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించండి

- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనను ఖండిస్తున్నాం : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖనిజాల అన్వేషణలో ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిఐటియు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చింది. మంగళవారం ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో ఖనిజ సంపదకు లోటు లేదని, అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేకపోతున్నందు వల్ల కార్పొరేట్, ప్రయివేటు విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పడం దారుణమని పేర్కొన్నారు. ప్రయివేటు రంగానికి అవసరమైన ప్రణాళికలనూ సిద్ధం చేస్తున్నామని ప్రకటించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ పోతున్న మోడీ సర్కారు కన్ను ఇప్పుడు దేశ ఖనిజ సంపదపై పడిందని, దాన్నీ కార్పొరేట్లకు దోచిపెట్టే ప్రయత్నాలను వేగతరం చేస్తుందని విమర్శించారు. ఖనిజ అన్వేషణను ప్రయివేటు రంగానికి కట్టబెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని కోరారు. దేశ ఖనిజ సంపద, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందనీ, ఐక్యఉద్యమాల్లో కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయం : కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బాన్సువాడలో ఉప ఎన్నికలు ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పారు. పార్టీ మారిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. మంగళవారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ నేతలు కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అన్ని రకాలుగా గౌరవించినా పార్టీని వీడటం ఆయనకే నష్టమని చెప్పారు. కార్యకర్తల కష్టం మీద గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం పార్టీని వీడటం వారిని బాధించిందన్నారు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేసిన వాళ్లు ఎంత పెద్ద వాళ్లైనా సరే వదిలిపెట్టేది లేదన్నారు. వారికి కార్యకర్తలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్‌లోకెళ్లిన తర్వాత పోచారం శ్రీనివాస్ రెడ్డిని కనీసం అడిగిన వాళు కూడా లేని దయనీయ పరిస్థితి వచ్చిందని చెప్పారు. బాన్సువాడ ఉప ఎన్నికల్లో కచ్చితంగా పోచారంను ఓడిస్తామని చెప్పారు. త్వరలోనే ప్రశాంత్ రెడ్డి, ఇతర పార్టీ సీనియర్ నాయకులు సహా తాను బాన్సువాడలో పార్టీ శ్రేణులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీని మోసం చేసి నాయకులు వెళ్లిపోయినప్పటికీ కార్యకర్తలు మాత్రం పార్టీ వీడలేదనీ, బిఆర్ఎస్‌కు కార్యకర్తలే కొండంత అండ అని చెప్పారు.

జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రతి కవితా కరుణ రస ప్రధానమే

ప్రజాశక్తి కల్చరల్

జంధ్యాల పాపయ్య శాస్త్రి ప్రతి కవితా కరుణ రస ప్రధానమేనని కరుణశ్రీగా అయన సార్థక నామధేయుడని రాష్ట్ర శాసన సభ తొలి సభాపతి ఎస్ మధుసూదనా చారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా మారుతీ కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగం గా జంధ్యాల పాపయ్య శాస్త్రి యాదిలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనా చారి పాల్గొని మాట్లాడుతూ పాపయ్య శాస్త్రి రచించిన పుష్ప విలాపం మధుర గాయకుడు ఘంటసాల గానంతో జగద్విఖ్యాతి పొందిందన్నారు. అయన రాసిన పలు కావ్యాలు కుంతీ కుమారి అరుణశ్రీ తెలుగు సాహితీ సంపద అని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై గాయకుడు త్రినాథ రావు పుష్ప విలాపంలోని పద్యాలు ఆలపించారు కళా పోషకుడు వెంకట రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ

- టి జూడా, టిఎస్ఆర్‌డిఎ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిమాండ్ల సాధన కోసం బుధవారం నుంచి అత్యవసర సేవలు మినహా అన్ని రకాల సేవలను బహిష్కరిస్తున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా), తెలంగాణ సీనియర్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిఎస్ఆర్‌డిఎ)లు తెలిపాయి. ఈ మేరకు బుధవారం రెండు సంఘాల నాయకులు వేర్వేరుగా డిఎంఇకి విధుల బహిష్కరణ చేస్తున్నట్టు లేఖలు అందజేశారు. కొల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటన, ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో నిరసనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో విధులు బహిష్కరించాలని జాతీయ స్థాయిలో ఫైమా, ఫోర్డా, ఆర్‌డిఎ సంఘాలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో రాష్ట్రంలోనూ ఆయా సంఘాలు విధులు బహిష్కరించనున్నట్టు ప్రకటించాయి. హత్యాచర ఘటనపై విచారణను సిబిఐకి అప్పగించి పారదర్శకంగా విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కేసులో వాస్తవాలను మార్చాలని ప్రయత్నించిన ప్రతి ఒక్కరినీ సస్పెండ్ చేయాలి. బాధితురాలి కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలి. జాతీయ స్థాయిలో అన్ని పని ప్రదేశాల్లో మహిళా వైద్యులకు ప్రత్యేక రూంలు, సరిపడినన్ని సిసి కెమెరాలు, భద్రతా సిబ్బందిని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను నెరవేర్చే వరకు తమ విధుల బహిష్కరణ కొనసాగుతుందని హెచ్చరించారు.

విద్యపై నిర్లక్ష్యం

కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయనీ, దీంతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ ఆగమై పోయిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల పనితీరు దీనికి అద్దం పడుతున్నదని తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాథమిక విద్యలోనూ ప్రభుత్వ పాఠశాలల పనితీరు తీసికట్టుగా మారిందని, ఉమ్మడి జిల్లాల విద్యా సమాచార వ్యవస్థ సర్వే నివేదిక స్పష్టం చేస్తున్నదని పేర్కొ న్నారు.తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదల కలను సాకారం చేసేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం దోహదపడుతుందనీ, దాని అమలులో రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రప్రభుత్వాల సహకారంతో మార్చి 2024 నాటికి 2.95 కోట్ల పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకుని ముందుకెళ్లా మన్నారు. రెండో విడతలో భాగంగా ఏప్రిల్ 2024 నుండి మార్చి 2029 మధ్య కాలంలో మరో రెండు కోట్ల పక్కా ఇళ్లను సొంతిల్లు అవసరమున్న గ్రామీణ ప్రాంత పేద కుటుంబాలకు నిర్మించి ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, దేశంలో కనీసం 10 కోట్ల మందికి లబ్ధిని చేకూర్చాలని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు.

కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్‌కు నేడు సిఎం శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ ఐటి దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ హైదరాబాద్‌లో తన కొత్త క్యాంపస్‌కు గురువారం శంకుస్థాపన చేయనున్నది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కాగ్నిజెంట్ కంపెనీ సిఇవో రవికుమార్‌తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల ఐదున రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్‌లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్‌ను నెలకొల్పుతామనీ, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేయనున్నది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకుని బుధవారం ఉదయం ముఖ్యమంత్రి హైదరాబాద్ చేరుకోనున్న నేపథ్యంలో కాగ్నిజెంట్ కంపెనీ శంకుస్థాపనలో ఆయన పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి ఆ కంపెనీ సిఇఒ రవికుమార్ కూడా హాజరు కానున్నారు.

మెరిట్ అభ్యర్థులతో గురుకుల పోస్టుల భర్తీ

- కెటిఆర్ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గురుకుల పోస్టుల్లో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు మంగళవారం కెటిఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఆయనకు వివరించారు. గురుకుల బోర్డు చేపట్టిన నియమాకాల్లో డౌన్ మెరిట్ లిస్టును ఆపరేట్ చేస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. గురుకుల బోర్డు చేపట్టిన నియమాకాలలో 9,024 పోస్టుల్లో డిసెండ్డింగ్ ఆర్డర్ పాటించకపోవటం, చాలామంది ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం మూలంగా సెకండ్ మెరిట్‌లో ఉన్న వారికి నష్టం జరుగుతున్నదని తెలిపారు. ఆ పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు జిఒ 81ను సవాల్ చేస్తూ ఐదు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ప్రభుత్వం తరుపున ఆ జిఒను అడ్డంకిగా చూపిస్తూ న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదని కెటిఆర్‌కు వారు వివరించారు. గతంలో టిఎస్ ట్రాన్స్‌కో, టిఎస్ ఎస్‌పిడిసిఎల్, టిఎస్ ఎన్‌పిడిఎస్ నిర్వహించిన వివిధ నోటిఫికేషన్లలో ప్రస్తుతం గురుకులాల్లో ఏర్పడుతున్నట్టుగానే భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉన్నప్పుడు నిరుద్యోగులు నష్టపోకుండా ఉండటం కోసం జీవో 81 అమలు చేయకుండా వన్ టైం రిలాక్సేషన్ కల్పించారని గుర్తు చేశారు. తద్వారా పోస్టులు మిగిలిపోకుండా డౌన్ మెరిట్ ఆపరేట్ చేసి తదుపరి మెరిట్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారని వివరించారు. అదే తరహాలో ఈ గురుకుల పోస్టుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. గురుకులాలతో పాటు డిఎస్‌సికి సంబంధించిన అభ్యర్థులనేకమంది న్యాయం కోసం ఎదురుచూస్తున్నారనీ, వారికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గురుకుల నిరుద్యోగ విద్యార్థులు రత్న శేఖర్ రెడ్డి, స్వాతితో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, విద్యార్థి విభాగం నాయకులకు గెల్లు శ్రీనివాసు, నిరుద్యోగ విద్యార్థులు దామోదర్ రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

565 కిలోల గంజాయి ధ్వంసం

- మత్తు పదార్థాలు, గంజాయి విక్రయాలపై నిఘా
- నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలో మంగళవారం రూ.1,41,25,000 విలువగల 565 కిలోల గంజాయిని పోలీసులు ధ్వంసం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు తీవ్ర కృషి చేస్తున్నారని, గంజాయి రవాణాపై నిరంతర నిఘా ఉంటుందని ఎస్‌పి శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ క్రమంలో అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 43 కేసుల్లో 565 కిలోల గంజాయిని సీజ్ చేసినట్టు చెప్పారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. జనావాసానికి దూరంగా.. నార్కట్‌పల్లి మండలం గుమ్మలబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గంజాయిని కాల్చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి శరత్ చంద్రపవార్ మాట్లాడుతూ.. అత్యధికంగా విజయపురి పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో 323 కేజీలు, కేతెపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో 98 కిలోల గంజాయిని సీజ్ చేయగా.. మొత్తం 43 కేసుల్లో 565 కిలోల గంజాయిని పట్టుకుని ధ్వంసం చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడటం వల్ల బంగారు భవిష్యత్ నాశనమవుతోందన్నారు. నిషేధిత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎస్‌పి తెలిపారు. ఎవరైనా గంజాయి రవాణా, విక్రయాలు చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారం తెలిస్తే.. టోల్ ఫ్రీ నెంబర్ 8712670266కి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి రాములు నాయక్, డిసిఆర్‌బి డిఎస్‌పి సైదయ్య, ఎస్‌బి సిఐ రాఘవరావు, నార్కట్‌పల్లి సిఐ కైగూరి నాగరాజు, శాలిగౌరారం సిఐ కొండల్ రెడ్డి, నార్కట్‌పల్లి ఎస్ఐ డి క్రాంతి కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని ధ్వంసం చేస్తున్న పోలీసులుం